ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డిసిఐపై పోర్టు అథారిటీ లేదా ?

- డ్రెడ్జింగ్ అధికారుల చుట్టూ ఆరోపణల ఉచ్చు
- నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఓ ఉన్నతాధికారి ?
- గత మేనేజింగ్ డైరెక్టర్‌పైనా ఇవే ఆరోపణలు
- పోర్టుల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదుల వెల్లువ



విశాఖ నగరంలోని డిసిఐ కార్యాలయం

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

కొంతమంది అధికారుల కారణంగా డిసిఐ నిత్యం వివాదాలమయంగా మారుతోంది. డ్రెడ్జింగ్ అధికారుల చుట్టూ ఆరోపణలు ముసురుకుంటూనే ఉన్నాయి. కేంద్ర కార్యాలయం విశాఖలో కలిగిన ఏకైక కంపెనీ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ). దీన్ని ప్రైవేట్‌పరం కాకుండా కొద్దిమంది అధికారులు, కార్మికులు, ఉద్యోగులు, సిపిఎం, సిఐటియు నేతలు పెద్ద ఎత్తున పోరాటాలు సాగించి కాపాడుకోగలిగారు. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన అధికారుల కారణంగా డిసిఐ నిత్యం వివాద వార్తల్లో నిలుస్తోంది. వాస్తవానికి వైజాగ్ పోర్టు వాటా దీనిలో అత్యధికంగా ఉండడంతో పోర్టు ఛైర్మన్ ఇక్కడ వ్యవహారాలపై దృష్టిసారించి సమీక్షలు జరపాల్సి ఉంది. అయితే వైజాగ్ పోర్టు అథారిటీ ఛైర్మన్‌గా అంగముత్తు బాధ్యతలు చేపట్టాక డిసిఐ పనితీరుపై దృష్టిసారించలేదన్న విమర్శలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా డిసిఐకు మేనేజింగ్ డైరెక్టర్లుగా వచ్చే వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో విక్టర్, నేడు దివాకర్‌పై అవినీతి, ఆర్థిక ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మేనేజింగ్ డైరెక్టర్‌ను అర్ధాంతరంగా బాధ్యతల నుంచీ తప్పించారు. తాజా అధికారిపైనా ఇవే గుసగుసలు వినిపిస్తున్నాయి.

తాజాగా ఏం జరుగుతోంది.

ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దివాకర్ సంస్థకు ఆర్థికంగా నష్టం చేకూర్చారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆయన 1987లో ఎస్సీ కోటా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా షిప్పులో డెక్ కేడెట్‌గా డిసిఐలో చేరారు. 2009లో డిజిఎంగా ఉద్యోగోన్నతి సాధించారు. ఆ తర్వాత పట్టుమని పదినెలలైనా పని చేయకుండా డిసిఐకు రాజీనామా చేశారు. డిసిఐకి ప్రత్యర్థి సంస్థగా పిలిచే మెర్కటర్ సంస్థలో డిజిఎం ఆపరేషన్స్‌గా జాయిన్ అయ్యారు. రెండున్నర సంవత్సరాలు పనిచేశాక 2012లో డిసిఐలోకి మరలా అడుగుపెట్టారు. సదరు ఉన్నతాధికారి డిసిఐకి రాజీనామా చేసి మెర్కటర్ సంస్థలో చేరాక డిసిఐకి నష్టం చేసేలా వ్యవహరించినట్లు కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఆ కాలంలోనే రూ.800 కోట్ల విలువైన పనులను డిసిఐ కంటే ఐదు శాతం వరకు అధికంగా కోట్ చేసి సదరు సంస్థ దక్కించుకుంది. దీని వెనుక ఆ అధికారి హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కొనసాగుతున్న విచారణ

విద్యార్హతలను బట్టి చూస్తే ఆయన ఇంటర్ దాటలేదని తెలుస్తోంది. విచారణ ప్రస్తుతం మిగతా 2లో..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ఉత్తరాంధ్రకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయండి

▶ వార్త మెయిన్‌లో..

సాధారణ ఛార్జీలతోనే..

దసరాకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : సాధారణ ఛార్జీలతోనే దసరా పండగకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు అదనంగా 250 బస్సులు నడపనున్నామన్నారు. విజయవాడ, హైదరాబాద్, అమలాపురం, భీమవరం, తదితర దూరప్రాంత బస్సులతో పాటు విజయనగరం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, ఇచ్ఛాపురం, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు ఉంటాయని మిగతా 2లో..

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

▶ వార్త 2లో..

26 నుంచి వైసిపి ఉత్తరాంధ్ర బస్‌యాత్ర

▶ వార్త 3లో..

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు

▶ వార్త 3లో..



అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

విద్యుత్ భారాలపై

వామపక్షాల నిరసన

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నాయకుల ఆగ్రహం వార్త 4లో..

సాంకేతిక సహకారంతో..

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ

ప్రజాశక్తి – కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : సాంకేతికత సహకారంతో భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, బహుళ ప్రయోజనాలు ఒనగూరుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ పేర్కొన్నారు. ఆ దిశగా అన్ని రాష్ట్రాలూ భూ రికార్డులను నవీకరణ చేయాలని సూచించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్సు మోడరనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖలోని ఓ హోటల్‌లో శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. భూ సర్వే, రికార్డుల భద్రత, నవీకరణ, మ్యుటేషన్ ప్రక్రియ, భూ సేకరణ, భూ సమీకరణ, రెవెన్యూ చట్టాల అమలు, రెవెన్యూ కోర్టు, ఈ–కోర్టు విధానాలు, స్వామిత్వ పథకం అమలు, ఆర్‌ఓఆర్ పట్టాల పంపిణీ తదితర అంశాలు సదస్సులో చర్చకు వచ్చాయి. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న భూ విధానాలు, రికార్డుల నవీకరణ ఇతర ప్రక్రియల గురించి ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ఉన్నతాధికారులు కేంద్ర బృందానికి మిగతా 2లో..



సదస్సులో పాల్గొన్న దక్షిణాది రాష్ట్రాల అధికారులతో అజయ్ టిర్కీ

మొదటి పేజీ తరువాయి..

డిసిఐపై పోర్టు అథారిటీ లేదా ?

ఆయన సమర్పించిన పత్రాలపై నడుస్తోంది. బికాం అంటూ నకిలీవి సమర్పించినట్లు తెలుస్తోంది. 2020 ఆగస్టులో ఉన్నతాధికారి పోస్టుకు డిసిఐ నోటిఫికేషన్ విడుదల చేశాక ఈ అధికారి ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన హిందూ రిలీజియన్‌గా దరఖాస్తులో పేర్కొన్నారు. అయితే ఆయన ఆ సమయంలో విశాఖలోని చాపెల్ బాప్టిస్ట్ చర్చికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. క్రిస్టియన్‌గా ఉంటూ ఉద్యోగం కోసం చేసిన దరఖాస్తులో హిందూగా పేర్కొనడం ఏమిటన్న ప్రశ్నలూ వినిపిస్తున్నాయి. అలాగే 2012లోనే బికాం పాసైనట్లు అఫిషియేషన్‌తో పాటు సర్టిఫికెట్ సమర్పించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాల సమర్పణపైనా, ప్రత్యర్థి సంస్థకు ఆర్థికంగా మేలు చేసి డిసిఐని దెబ్బతీసిన అంశంపైనా ఆయనపై కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖకు మరోదఫా తాజాగా ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన కొద్దిరోజులే ఇన్‌ఛార్జిగా ఉంటారని, తర్వాత పూర్తిస్థాయి అధికారిని డిసిఐకి నియమించనున్నారని పోర్టు అథారిటీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

వివరించారు. ఈ సందర్భంగా అజయ్ టిర్కీ మాట్లాడుతూ భవిష్యత్తులో తలెత్తే ఎన్నో ప్రశ్నలకు మాతృభూమి పోర్టల్ సమాధానంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉన్న అన్ని రకాల ల్యాండ్ రికార్డులను నవీకరించాలని, రాజ్యాంగంలో గుర్తించిన భాషల్లోకి అనువదించాలని సూచించారు. న్యాయపరమైన అంశాల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఈ-కోర్టు విధానానికి అనుగుణంగా వివరాలను అనుసంధానం చేయాలన్నారు. రెవెన్యూ కోర్టు అంశాలను పరిగణనలోకి తీసుకొని పక్కా వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. పూర్తి పారదర్శకత ఉండేలా ఎఫ్‌ఎంబి మ్యాపులను అనుసంధానించాలని, భూ ఆధార్ విధానంలో భాగంగా సంబంధిత రైతుల ఆధార్ నెంబర్లను ఖాతాలకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. కేంద్రం అనుసరిస్తున్న భూ సంబంధిత విధానాలకు అనుగుణంగా వివిధ రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే, ల్యాండ్ రికార్డ్సు విభాగం కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 54 శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూ వనరుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సోన్మోని బోరా, పలువురు ఉన్నతాధికారులు, విశాఖ, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు డాక్టర్ ఎ.మల్లికార్జున, శ్రీకేష్ లఠ్కర్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు

తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులకు సంబంధించి ముందుగా టిక్కెట్లు తీసుకొనే సౌలభ్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముందుగా రిజర్వేషన్ పొందగోరు ప్రయాణికులు అంతర్జాలంలో www.apsrtconline.in లోగానీ, ముఖ్యమైన కూడళ్లలో ఆర్‌టిసికి సంబంధించిన ఎటిబి ఏజెంట్ల వద్దగానీ టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చునన్నారు. రానుపోను టిక్కెట్ ఒకేసారి బుక్ చేసుకున్న వారికి ప్రయాణ ఛార్జీలో పది శాతం తగ్గింపు సదుపాయం ఉందని వెల్లడించారు.

రూట్ల వారీగా అదనపు బస్సులు ఇలా..

విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 37 బస్సులు, విజయవాడకు 60 బస్సులు, శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు 100 బస్సులు, అమలాపురం, భీమవరంనకు 3 బస్సులు, రాజమండ్రికి 25 బస్సులు, కాకినాడకు 25 బస్సులు నడపనున్నట్లు అప్పలరాజు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆన్‌లైన్ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆన్‌లైన్ ఆటోలకు ఎయిర్‌పోర్టులో పికప్ ఇవ్వాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఓలా, ఉబర్, రాపిడో, యాపిల్ ద్వారా ఆన్‌లైన్ ఆటో సర్వీస్ చేస్తున్న కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌ల ద్వారా దాదాపు విశాఖ నగరంలో పది వేల మంది ఆటో కార్మికులు సర్వీస్ అందిస్తున్నారన్నారు. వీరికి ఆ కంపెనీ వారు అనుమతులు ఇచ్చేటప్పుడు పలు రకాల సౌకర్యాలు కల్పించి, ఇప్పుడు ఒక్కొక్కటిగా తొలగించడం తగదన్నారు. తాజా చర్యల వల్ల ఆన్‌లైన్ ఆటో కార్మికులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఓలా కంపెనీకి నగరంలో కార్యాలయమే లేదని, దీంతో తమ కష్టాలను డ్రైవర్లు చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. వారం రోజులుగా ఎయిర్ పోర్టులో దిగిన ప్రయాణికులకు ఆటో సౌకర్యం లేకుండా యాప్ నుంచి ఆప్షన్ తొలగించారని, ఇది అన్యాయమని అన్నారు. ఎయిర్ పోర్టులో దిగిన సామాన్య, మధ్య తరగతి వారికి ఆటో సర్వీస్ అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో శేషుబాబు, ప్రకాష్, వరప్రసాద్, నేతాజీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులు, ప్రాథమిక వసతులు, వాణిజ్యం, ఐటి శాఖ మాత్యులు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన 'స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ మీటింగ్ ఫర్ యాసింగ్ ట్రాఫిక్ అండ్ ఇంప్రూవింగ్ రోడ్ కనెక్టివిటీ' సమావేశంలో టిటిడి మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు చుట్టూ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని, దీనితో పాటు స్టీల్ ప్లాంట్, హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డ్, బిహెచ్ఇఎల్, ఫార్మా రంగం విస్తరించాయని అన్నారు.

అనివార్యంగా విశాఖలో విపరీతమైన ట్రాఫిక్ సమస్య పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అనకాపల్లి జిల్లా కలెక్టర్ పి.రవి సుభాష్, సిపి ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, పోర్టు వైస్ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, సిఐఐ చైర్మన్ పి.లాల్‌కృష్ణ, వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్, కన్వీనర్ సాంబశివరావు పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లో శుక్రవారం రొమ్ము కేన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. సిఎస్ఆర్ బ్లాక్ అంకాలజీ విభాగంలో నిర్వహించిన ఈ సదస్సులో భాగంగా రేడియో థెరపీ విభాగం ఆధ్వర్యాన 50 మందికి స్క్రీనింగ్ టెస్ట్ చేసి రొమ్ము కేన్సర్‌కి సంబంధించిన కారణాలు, ముందస్తు నిర్ధారణ, చికిత్స విధానాల గురించి అవగాహన కల్పించారు. వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, అంకాలజీ డిపార్టుమెంట్ అధిపతి డాక్టర్ శిల్ప, రేడియోథెరపీ విభాగాధిపతి పాండురంగ కుమారి పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం ఉండేది వంద రోజులే : గంటా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉండేది మరో వంద రోజులు మాత్రమేనని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో బస్ షెల్టర్ సరిగ్గా కట్టలేకపోయారని, రాజధాని ఎలా చేయగలరని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ టిడిపికి చివరి రోజులు అంటున్నారని, ఎవరికి చివరి రోజులో ఎన్నికల్లో తెలుస్తాయని అన్నారు. విశాఖలో ఏ మూలకు వెళ్లినా వైసిపి వారి భూ కబ్జాలు బయటపడతాయన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పశ్చిమ ఎమ్మెల్యే పివిజి.నాయుడు (గణబాబు) పాల్గొన్నారు.

ఆత్మహత్యలు, మత్తు పదార్థాలపై పరిశోధన చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల ఆత్మహత్యలు, మత్తు పదార్థాలపై అధ్యయనం, పరిశోధనలు జరగాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు అన్నారు. ఎయు సోషల్ వర్క్ విభాగంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి సమగ్ర నివేదికను కమిషన్‌కు సమర్పించాలని విసి ప్రసాద్‌రెడ్డిని శుక్రవారం కోరారు.

విష ప్రచారం తగదు

ఎంవిపి.కాలనీ : బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కొన్ని పత్రికల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వంపై విషప్రచారం సాగించడం తగదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధానిగా చేసే క్రమంలో ముఖ్యమంత్రితో సహా పలువురు అధికారులకు అవసరమైన నివాస గృహాలు సమకూర్చేందుకు ప్రభుత్వం కమిటీని నియమించినప్పటి నుంచి వారంతా విషం చిమ్ముతున్నారని వ్యాఖ్యానించారు.

ఎల్ఐసి క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వచ్చే నెల 26 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు గోవాలో జరగబోయే ఆల్ ఇండియా ఎల్ఐసి క్రీడల్లో విశాఖపట్నం నుంచి ప్రాతినిధ్యం వహించబోతున్న ఎల్ఐసి క్రీడాకారులను ఎల్ఐసి విశాఖపట్నం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్ శుక్రవారం సత్కరించారు. ఎస్.కార్తీక్, వి.జోష్న, ఎల్.సురేంద్ర బాబు, జి.వి.పద్మావతి, బి.శ్రీనివాసరావు సత్కరిం పబడిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పర్సనల్ కె.భగవాన్ ప్రసాద్, స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు సభ్యులు డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ, స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కమిటీ మెంబర్ ఎస్.పద్మ పాల్గొన్నారు.

పలుచోట్ల డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ శుక్రవారం డివిజన్ ఉన్నతాధికారులతో కలిసి నూకపాడు, చీపురుపల్లి స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ఆయా స్టేషన్లలో సౌకర్యాలపై సమీక్షించారు.

ప్రజాశక్తి 3
శనివారం 14 అక్టోబర్ 2023

28న సింహాద్రి అప్పన్న దర్శన వేళల్లో మార్పు

ప్రజాశక్తి- సింహాచలం: ఈనెల 28న శనివారం రాత్రి 1.07గంటలకు చంద్రగ్రహణం సంభవించి, రాత్రి 2.36గంటల వరకు మోక్షకాలం ఉన్నందున శనివారం ఉదయం 6:30గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే స్వామి దర్శనాలు కల్పిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. తిరిగి 29న ఉదయం 8 గంటలకు భక్తులకు దర్శనం ఉంటుందన్నారు. గ్రహణం నేపథ్యంలో 29వ తేదీన జరగాల్సిన సుప్రభాతం, ఆరాధన, గరుడ సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు.

అప్పన్న సన్నిధిలో పోలీస్ అధికారులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను హోంమంత్రిత్వశాఖ స్పెషల్ సెక్రటరీ, డిజిపి ఎంఎస్. శివగామి, సుందరినంద శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి డి భ్రమరాంబ ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అధికారులు దుశ్శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని బహూకరించగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు. స్వామిని దర్శించిన వారిలో డిసిపి ఆనందరెడ్డి ఎసిపి నరసింహమూర్తి, గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, పెందుర్తి సిఐ ఉన్నారు.

'సెమిస్టర్ పరీక్షలకు సిద్ధంకండి'

ప్రజాశక్తి - భీమునిపట్నం: వచ్చేనెలలో జరగనున్న ఒకటో సెమిస్టర్ పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఇఒ ఎం.శివరాణి విద్యార్థినులకు సూచించారు. శుక్రవారం స్థానిక కెజిబివిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృభాష తెలుగుతోపాటు, ఆంగ్లంలోనూ ప్రావీణ్యం సాధించాలన్నారు. పిల్లలను, వారి రోజువారీ దినచర్యలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. దసరా సెలవు నేపథ్యంలో ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్ ను పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎ -2లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

వెల్లంకి వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీ కేంద్రం వద్ద ఆర్‌టిసి బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు కోరారు స్థానికంగా బస్‌స్టాప్ లేకపోవడం వల్ల ప్రయాణికులు బస్ ఎక్కాలన్నా, బస్ దిగి గ్రామానికి రావాలన్న దాదాపు కిలోమీటరు దూరం రోడ్డు వెంబడి నడవాల్సి వస్తోందన్నారు. ఆర్‌టిసి రెగ్యులర్ లేకుంటే రిక్వెస్ట్ బస్‌స్టాప్ అయినా ఏర్పాటు చేసి, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని సర్పంచ్‌తోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు ప్రహ్లాదపురం కోలాట బృందం

ప్రజాశక్తి-పెందుర్తి : ఈనెల 17, 18 తేదీలో తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు ప్రహ్లాదపురం కోలాట బృందం ఎంపికైందని బృంద ప్రతినిధులు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు ఆహ్వానం అందడంపై ఆనందం వ్యక్తం చేశారు.

91వ వార్డులో గడపగడపకూ..

ప్రజాశక్తి -గోపాలపట్నం : 91వ వార్డు రామకృష్ణనగర్‌లో జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. సమస్యలపై వినతులు స్వీకరించారు. అర్హులైన 10 మందికి రైస్ కార్డులను పంపిణీ చేశారు. సాంకేతిక ఇబ్బందులతో పెన్షన్‌కు నోచుకోని ఒకరికి ప్రతినెలా తన సొంతడబ్బులతో పింఛను ఇస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, నమ్మి శ్రీను, కాళ్ల వీర్రాజు, వెంకటేష్, ఊటపల్లి గోవిందు, తెలుకుల రమేష్, దుర్గేష్, వెంకట్, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, తమ్మి రెడ్డి, తాతారావు, కడితి రాజు, మార్కండేయ రాజశేఖర్, జీవీ రమణ, బల్లంకి ప్రేమ్‌కుమార్, భారతిప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

26 నుంచి వైసిపి ఉత్తరాంధ్ర బస్‌యాత్ర



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి బొత్స

ప్రజాశక్తి -మధురవాడ: ఈనెల 26 నుంచి వచ్చేనెల 9వరకు వైసిపి ఉత్తరాంధ్ర బస్‌యాత్ర చేపడుతుందని రాష్ట్రమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈనెల 26న ఇచ్ఛాపురంలో ప్రారంభమై, రోజుకో నియోజకవర్గంలో పర్యటిస్తూ, వచ్చేనెల 9న అనకాపల్లితో ముగుస్తుందన్నారు. బస్‌యాత్రలో భాగంగా ఈ నెల 27న విజయనగరం జిల్లా గజపతినగరం, 28న భీమిలి,30న పాడేరు, 31న శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో బస్‌యాత్ర సభలు ఉంటాయన్నారు.

శుక్రవారం ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో బొత్స మాట్లాడుతూ, అన్ని వర్గాలకు రాజ్యాధికారం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమని, వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించారన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. విశాఖ కేంద్రంగా పాలన సాగాలన్న కోరిక తమలోనూ ఉందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైసిపి గెలుస్తుందని, టిడిపికి నాలుగు నెలలే చివరివన్నారు. ముఖ్యమంత్రి జగన్ వాస్తవాలే మాట్లాడారని, ఎవరిపైనా వ్యక్తిగత దూషణలు చేయలేదన్నారు. అమిత్‌షానే కాదు, ఇంకెవరినీ లోకేష్ కలిసినా తమకు అభ్యంతరం లేదన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర వైసిపి బస్‌యాత్ర షెడ్యూల్‌ను మంత్రుల బృందం ప్రకటించింది. 26న ఇచ్ఛాపురం, 27న గజపతినగరం, 28న భీమిలి, 30న పాడేరు, 31న ఆముదాలవలస, నవంబర్ 1న పార్వతీపురం, 2న మాడుగుల, 3న నరసన్నపేట, 4న ఎస్.కోట, 6న గాజువాక, 7న రాజాం, 8న సాలూరు, 9న అనకాపల్లిలో వైసిపి సామాజిక బస్‌యాత్ర ఉంటుందన్నారు. మంత్రులు బూడి ముత్యాల నాయుడు, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కోలగట్ల వీరభద్ర స్వామి, ధర్మాన కృష్ణదాసు, పాలవలస విక్రాంత్, మధ్య శ్రీనివాస్, కోలా గురువులు, వరుదు కల్యాణి పాల్గొన్నారు

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి- పిఎం.పాలెం : భారతీయ విద్యా కేంద్రం, విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో చంద్రంపాలెం పాఠశాల గ్రౌండ్‌లో 34వ విద్యాభారతి నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. కేంద్రమంత్రి ఎ.నారాయణస్వామి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. . అండర్-14 బాలికలు, అండర్-19 బాలుర, బాలికలకు చంద్రంపాలెంలో పోటీలను నిర్వహించారు. విశాఖవేదికగా నాలుగు కేంద్రాల్లో పోటీలను నిర్వహించగా, 21 బాలుర,19 బాలికల జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలోఆల్ ఇండియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ముక్తాల్ సింగ్ బాద్యా, విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ టి ఎస్‌ఆర్ ప్రసాద్, అధ్యక్షులు సునీల్ మహంతి, బిజెపి నేతలు విష్ణుకుమార్‌రాజు, రవీందర్ రెడ్డి, కెవిఎన్‌పి చక్రవర్తి, నాగరాజు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జాతీయ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో పలు జట్లు తలపడ్డాయి. ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ జివిఎల్.నరసింహారావు, ఎయు విసి ప్రసాదరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. బివికె చైర్మన్ ప్రొఫెసర్ పివిఎస్ అవధాని, విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ టిఎస్‌ఆర్.ప్రసాద్, అధ్యక్షులు సునీల్ మహంతి పాల్గొన్నారు

ప్రత్యామ్నాయ అవకాశాలపై యువత దృష్టి పెట్టాలి

పోర్టల్స్ ప్రారంభోత్సవంలో గీతం విసి



పోర్టల్ ప్రారంభోత్సవంలో గీతం విసి, రిజిస్ట్రార్

ప్రజాశక్తి- విశాఖపట్నం : వృత్తి విద్యా కోర్సులను అభ్యసించే యువతరం కేవలం ప్రాంగణ నియామకాలను మాత్రమే నమ్ముకోకుండా, స్టార్టప్‌ల ఏర్పాటు, ఉన్నతవిద్య, సివిల్ సర్వీసెస్‌లో ప్రవేశించడం వంటి ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారించాలని గీతం విసి దయానంద సిద్ధవటం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అన్నారు. శుక్రవారం గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ విద్యార్థులకు వివిధ అవకాశాలపై సమాచారం ఇచ్చేందుకు రూపొందించిన వివిధ పోర్టల్స్‌ను ప్రారంభించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి గీతం వెంచర్ డవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటుతో పాటు హ్యాకథాన్‌ల నిర్వహణ, విదేశీ విద్యాలయాలలో అవకాశాలపై ఎడ్యుకేషన్ ఫైరల ఏర్పాటు, సివిల్ సర్వీసు ఉద్యోగాలపై అవగాహన కలిగిస్తున్నామన్నారు. విద్యార్థులు వివిధ అంశాలపై పట్టు సాధించడానికి కురుసెరా మాధ్యమం ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. కొత్తగా ప్రారంభించిన వివిధ పోర్టల్స్ విద్యార్థులకు మార్గదర్శకం కాగలవన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ బి.వికాస్, స్టూడెంట్ లైఫ్ డిప్యూటీ డైరక్టర్ శృతి పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

'రవీంద్రభారతి' యాజమాన్యం నిరంకుశత్వం

ఫీజులు చెల్లిస్తేనే విద్యార్థులను ఇళ్లకు పంపిస్తామని మొండిపట్టు

ప్రజాశక్తి-ఆనందపురం : వెల్లంకి సమీపంలోని రవీంద్రభారతి గ్లోబల్ పాఠశాల యాజమాన్యం నిరంకుశ వైఖరిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన,ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి దసరా సెలవులు కావడంతో పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు మెసేజ్‌లు పెట్టిన యాజమాన్యం, తీరా పాఠశాల వద్దకు వచ్చేసరికి ఫీజులు చెల్లిస్తేనే ఇంటికి పంపిస్తామని, లేకుంటే లేదని తెల్చిచెప్పడంతో తల్లిదండ్రులు విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. సగం ఫీజులు చెల్లించామని మిగిలిన సగం డిసెంబరు లోపు చెల్లిస్తామని చెప్పినా యాజమాన్య ప్రతినిధులు వినకపోవడంతో పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులు స్పందించి, ఫీజుల వేధింపులపై దృష్టి పెట్టాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

నేరాలు ఘోరాలు

గోస్తనీ శ్మశానవాటిక వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - తగరపువలస : స్థానిక గోస్తనీ పాత వంతెన, శ్మశానవాటిక వద్ద శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని భీమిలి పోలీసుల కథనం ప్రకారం...మృతుని వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటుందని, గ్రీన్, బ్లాక్ కలర్ గడుల చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద దొరికిన పాన్‌కార్డు ఆధారంగా దువ్వి పైడిరాజుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ప్రజా సమస్యలపై వినతి



మేయర్, కమిషనర్లకు వినతిపత్రాలిస్తున్న రాజు, వైసిపి నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులు, సమస్యలపై నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలను కలిసిన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు నేతృత్వంలోని వైసిపి కార్పొరేటర్ల బృందం చర్చించింది. ఉత్తర నియోజకవర్గంలో కమ్యూనిటీహాళ్లు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, వీధిదీపాలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్లు, రక్షణ గోడలు నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్,రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కెవిఎన్ శశికళ, వార్డు ఇన్‌ఛార్జిలు నీలి రవి, పీలా వెంకటలక్ష్మీ ఉన్నారు.

స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచిన సింధుకు సత్కారం

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్ పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి, విశాఖ నగరానికి గుర్తింపు తెచ్చిన చిన్నారి సింధును నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం ఆరిలోవలోని తన క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేపాల్‌లో ఈనెల 5 నుంచి 9 వరకు జరిగిన అంతర్జాతీయ స్థాయి ఐదేళ్లలోపు చిన్నారుల స్కేటింగ్ పోటీలలో ఎ.సింధు రెండు బంగారు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా మారిశెట్టి

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి జిల్లా కార్యదర్శిగా మారిశెట్టి నాగేశ్వరరావును నియమించినట్లు ఆపార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.తనకు బాధ్యతలు అప్పగించిన వైవి.సుబ్బారెడ్డికి, జిల్లా అధ్యక్షులు కోల గురువులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌కు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, సీనియర్ నేత అక్కరమాని విజయ నిర్మల వెంకటరావు, వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతి దాస్‌లను మారిశెట్టి నాగేశ్వరరావు స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి విధానంలో పంటల సాగు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని స్థానిక కెజిబివి ప్రిన్సిపల్ గంగాకుమారి సూచించారు. శుక్రవారం గ్రీన్‌క్లైమేట్ స్వచ్ఛందసంస్థ బృందం ఆధ్వర్యంలో మిద్దెతోటలు, ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పావని, ఉపాధ్యాయులు కీర్తి, కుసుమ, కిరణ్, యశోద, శాంతి, గ్రీన్ క్లైమేట్ సభ్యులు రాజేశ్వరి, రవితేజ పాల్గొన్నారు

విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లపై
వామపక్షాల నిరసన

విద్యుత్ ఛార్జీల పెంపు, ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జీల పేరుతో అదనపు మోత, సంస్కరణల్లో భాగంగా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు తదితర సమస్యలపై వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఛార్జీలను తగ్గించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పెందుర్తిలో విద్యుత్‌ఛార్జీల భారంపై ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు.

(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

అనకాపల్లి : పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని కోరుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయం ఎఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో భాగంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచిందని, ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఎప్పుడో వాడిన విద్యుత్‌కు నాడే బిల్లులు చెల్లించగా, ట్రూ అప్ ఛార్జీల పేరుతో మరలా వసూలు ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. అధిక ధరలతో సతమవుతమవుతున్న ప్రజలపై స్మార్ట్ మీటర్ల పేరుతో మరో భారం వేయడం సరికాదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి, వైసిపి ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయనబాబు, గంటా శ్రీరామ్, ఆర్.శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, ఎ.బాలకృష్ణ, సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, రాజాన దొరబాబు, వైఎన్.భద్రం, శంకర్రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : విద్యుత్ భారాలపై స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఐ, సిపిఎం నేతలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు చెప్పిన మాటలు మరిచిపోయాయని, పేదవాడిపై భారాన్ని తగ్గిస్తామని చెప్పి గద్దెనెక్కి ఇప్పుడు గ్యాస్, పెట్రోల్, విద్యుత్ ఛార్జీలు పెంచి భారం మోపుతున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు జి.గురుబాబు, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్‌వి.రమణ, ఈరెల్లి చిరంజీవి, జి.రాధాకృష్ణ, శివలంక కొండలరావు, మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామమూర్తి, భూషణం, శ్రీరంగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

విశాఖ కలెక్టరేట్ : సామాన్యులపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. విద్యుత్ భారాలపై సిపిఐ, ముఠా కార్మిక సంఘం (ఎఐటియుసి) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పూర్ణామార్కెట్ స్ప్రింగ్ రోడ్డు, పందుంపుల్లల సందు తదితర ప్రాంతాలలో వ్యాపారులకు, ప్రజలకు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు.

విద్యుత్ ఛార్జీల భారంపై ఇంటింటా ప్రచారం

పెందుర్తి : పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించకుంటే సిఎం జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి పరాభవం తప్పదని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం జివిఎంసి 94,95వార్డులు వేపగుంట సమీపంలోని వరలక్ష్మీనగర్, ముత్యమాంబ కాలనీల్లో సిపిఐ పెందుర్తి శాఖ కార్యదర్శి అసిరి నాయుడు, పార్టీ నేతలు ఎ.శ్రీనివాసరావు, రామారావు, మల్లేష్‌లతో ఇంటింటా తిరుగుతూ, విద్యుత్‌ఛార్జీల భారంపై ప్రజలకు వివరించారు. స్మార్ట్‌మీటర్లు పేరుతో వినియోగదారులకు ఎలా దోపిడి చేయాలనుకున్నారో సమగ్రంగా వివరించారు.

సెలవు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార : దసరా సెలవుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు రాష్ట్రంలో అన్ని యాజమాన్యాలలోని విద్యాసంస్థలు తెరవడానికి వీలులేదని, నిబంధనలు అతిక్రమిస్తే తీవ్ర చర్యలుంటాయనేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం హెచ్చరించారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, సిలబస్ పూర్తి కాలేదని, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, వర్క్‌షాపుల పేరుతో తరగతులు నిర్వహిస్తే, పాఠశాల గుర్తింపు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులకు సిఫార్సు చేస్తామని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. దీనిపై ఎంఇఒ, డిఇఒ, 1098 చైల్డ్‌లైన్‌కు, 1092 కాల్‌సెంటర్‌కు, ఇంకా secy.se.edn@gmail.com అలాగే apscpcr2018 @gmail.comలకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అంధుల పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో గేయాలాలపిస్తున్న అంధవిద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ: పిఎం.పాలెం న్యాయకళాశాల రోడ్డులోని విశాఖ మోడల్ అంధుల పాఠశాల 43వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బి.సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చినగదిలి ఎంఇఒ రవీంద్రబాబు,గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవిర్భావం, చరిత్రను కరస్పాండెంట్ బి.రత్నరాజు వివరించారు. రానున్న రోజుల్లో మరింతమందికి సేవ అందించేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు. ఎంఇఒ రవీంద్రబాబు మాట్లాడుతూ, తాను సందర్శించిన పాఠశాలల్లో అంధుల పాఠశాల ఎంతో ప్రత్యేకమైనదని, పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు.వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన ముఖ్య అతిథి గణేష్, విద్యార్థులను అభినందించి, బహుమతులను అందజేశారు.

భువనేశ్వరికి సంఘీభావం



భువనేశ్వరిని కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని రాజమండ్రిలో టిడిపి బిసి సాధికారత పద్మశాలి రాష్ట్ర కమిటీ సభ్యులు, తగరపువలసకు చెందిన వానపల్లి సత్య, జివిఎంసి ఒకటో వార్డు నాయకులు ఇ.సోమేష్, పద్మశాలి సంఘం ప్రతినిధులు శుక్రవారం కలిసి సంఘీభావం తెలిపారు

ఎంఎస్ఎంఇ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : ఎంఎస్ఎమ్ఇ, పరిశ్రమల శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని వాసవా అధ్యక్షులు పాండురంగ ప్రసాద్ అన్నారు. శుక్రవారం గాజువాక ఆటోనగర్ వాసవ కార్యాలయంలో ఎంఎస్ఎంఇ పథకాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఇ జనరల్ మేనేజర్ గణపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పారిశ్రామిక అభివృద్ధి విధానం 2023-27ను వివరించారు. ఎంఎస్ఎంఇ-టిసి, ఎన్ఎస్ఐసి, కెవిఐసి, ఐడిబిఐ పథకాలపై అవగాహన కల్పించారు. ఈనెల 2 నుంచి 31వరకు ఎంఎస్ఎంఇ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవం సందర్భంగా కెవిఐసి నోడల్ ఆఫీసం డి సుబ్రహ్మణ్యం ఖాదీ ప్రతిజ్ఞ చేయించారు. 'వోకల్ ఫర్ లోకల్' ప్రోత్సహించడానికి ఖాదీ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు..

థీమ్ పార్కులను త్వరితగతిన పూర్తి చేయండి

అధికారులకు జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ వర్మ

ప్రజాశక్తి -పిఎం పాలెం : గ్రేటర్ విశాఖ పరిధిలో చేపడుతున్న పలు థీమ్ పార్కులను, ల్యాండ్ స్కేప్ గార్డెన్ పార్కులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెండవ జోన్, ఆరవ వార్డు షిప్‌యార్డ్ లేఅవుట్‌లోని యోగా థీమ్ పార్క్, బక్కన్నపాలెం లచ్చిరాజు లేఅవుట్‌లోని స్పోర్ట్ థీమ్‌పార్క్, ఎంఎస్ఆర్ లేఅవుట్ ఉజ్వల్‌నగర్ ల్యాండ్‌స్కేపింగ్ గార్డెన్ పార్కులను ఎస్ఇ శాంసన్‌రాజు, జెడ్‌సి కనకమహాలక్ష్మి, డిడి.హెచ్ దామోదర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

పరిశీలనకు ముందు కమిషనర్ మాట్లాడుతూ, యోగాథీమ్ పార్క్‌ను పెద్దచెట్లు, చిన్న మొక్కలతో అందంగా తీర్చిదిద్ది, దసరా నాటికి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎస్ఇ శాంసన్ రాజును ఆదేశించారు. లచ్చిరాజు లేఅవుట్ స్పోర్ట్స్ థీమ్ పార్కులో బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, హాఫ్ బాస్కెట్‌బాల్, మల్టీ ప్లేగ్రౌండ్స్ కోర్టుల పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంఎస్ఆర్ లేఅవుట్, ఉజ్వల్ నగర్ ల్యాండ్ స్కేపింగ్ గార్డెన్ పార్క్‌ను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా పార్కులు సిద్ధమైన తర్వాత తమకు అప్పగిస్తే వాటిని పరిశుభ్రంగా ఉంచుకుని వినియోగిస్తామని యోగా థీమ్ పార్క్ కోసంవాల్ చంద్‌నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్పోర్ట్ థీమ్‌పార్క్ కోసం బక్కన్నపాలెం క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు విన్నవించారు. దీనిపై కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందిస్తూ, థీమ్ పార్కులను ప్రజల కోసమే అందుబాటులోకి తెస్తున్నామని, వాటిని సక్రమంగా నిర్వహిస్తాంమంటే తప్పకుండా అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎసిపి శర్మ, ఇఇ శాంతిరాజు, ఎఇఇలు సురేష్, శ్రీహరి పాల్గొన్నారు

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఉత్తర వైసిపి సమన్వయకర్త రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు బోరావారి వీధి, లలితానగర్ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలతో సిసి డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు.వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బోరావారివీధి సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజామోద పాలనను సిఎం జగన్ చేపడుతున్నారన్నారు.కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బలుసు జగదీశ్, వార్డు నేతలు బొడ్డేటి కిరణ్, ఎం.సునీల్, విజయ్‌పాల్, పి.రమాదేవి, ఇ.ప్రకాష్, శ్యామల, శేషు, హరి, ఫరూక్, సుశీల, జి.లక్ష్మి, నవాబ్, బాబ్‌జాన్, రామారావు, శ్రీను పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

జివిఎంసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల నిరసన



పారిశుధ్య కార్మికుల నిరసనలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి -మాధవధార : ఏడు నెలల హెల్త్ అలవెన్స్ బకాయి, తప్పిపోయిన నెలసరి వేతనాల చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి 51వ వార్డు మాధవధార వుడాకాలనీ బస్‌స్టాప్ వద్ద శుక్రవారం పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కంచరపాలెం జోన్ సిఐటియు నేత ఎస్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గతనెలలో సమ్మె సమయంలో సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన అధికారులు తర్వాత పట్టించుకోకపోవడ దుర్మార్గమన్నారు. 15రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో పాపారావు, దేవి, లక్ష్మి, పోలయ్య, శ్యామల, లక్ష్మమ్మ సుబ్బమ్మ పాల్గొన్నారు.

గాజువాక: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భరోసా ఖర్చుల నిధులు తక్షణమే విడుదల చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ నాయకులు గొలగాన అప్పారావు డిమాండ్ చేశారు. 69వ వార్డు తుంగ్లాం, షీలా నగర్ ఏరియాలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం మస్టర్ పాయింటు వద్ద జరిగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సమ్మె ఒప్పందాల తీర్మానాలను అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల హెల్త్ అలవెన్స్ బకాయి చెల్లించాలని, ఆప్కాస్ ద్వారా మిస్సవుతున్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు .కార్యక్రమంలో రామ్మూర్తి, సత్యవతి, రవణమ్మ, విజయ్, ఈశ్వరరావు పాల్గొన్నారు..

సమస్యల పరిష్కారానికి ధర్నా



రైల్వే వ్యాగన్ కార్మికుల ధర్నాలో కెఎం.శ్రీనివాస్, రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వడ్లపూడి రైల్వే వాగన్ కంపెనీ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, కొత్త జిఒ ప్రకారం వేతనాలను ప్రతినెలా 10లోగా చెల్లించాలని, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జోన్ నాయకులు ఎం రాంబాబు, జోన్ కార్యదర్శి ఎ.లోకేష్, కంపెనీ యూనియన్ నేతలు పి.అవతారం, రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీలలో హరిపాలెం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎ.కుషన్ భాస్కర్ అండర్ -14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపాద రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విశాఖ జిల్లా ఆర్మ గ్రౌండ్ విశాలాక్షి నగర్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పోటీలలో పిఐఎం ఈశ్వరీ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో 100 మీటర్స్ రిలేకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి, రాజును , ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం, గ్రామ సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం, ఎంపిటిసి సభ్యులు ఎస్ జ్యోతి ప్రసాద్, స్కూల్ ఛైర్మన్ ఎం శివ, ఉఉపాధ్యాయులు, కుమార్, గాంధీ, బాషా, వెంకటేష్, పట్నాయక్. కె అమ్మాజ, హైమావతి, కరుణి , మారినిషా తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మామిడిపాలెం విద్యార్థుల ఎంపిక

అనకాపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్, అండర్ ఫోర్టీన్ ఫెన్సింగ్ పోటీల్లో మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 బాలుర విభాగంలో పదవ తరగతి చదువుతున్న మునగపాక నరేంద్ర గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికకాగా, బొజ్జ లోకేష్ తృతీయ బహుమతి పొందాడు. రాష్ట్రస్థాయి అండర్ ఫోర్టీన్ ఫెన్సింగ్ క్రీడలో బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న కుర్రు జానకీ, కుర్రు కావ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి.శ్రీధర్, గ్రామ సర్పంచ్ పూడి పరదేశి నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్ గౌరీ, ఇన్చార్జి హెచ్ఎం బివిఎస్. బాబు, ఆంగ్ల ఉపాధ్యాయులు గొంది చిన్నబ్బాయి, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.పరమేశ్వరి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం అభినందించారు.



మెడల్స్ చూపుతున్న విద్యార్థులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, జెసి, ఎస్‌పి తదితరులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలో యుజయా కంపెనీ ప్రారంభోత్సవానికి ఈ నెల 16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సందర్భంగా, యుజయా కంపెనీ గ్రౌండ్స్‌లో హెలీప్యాడ్, ప్రారంభోత్సవ, వేదిక ఏర్పాటు పనులను శుక్రవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అనకాపల్లి ఆర్డీఓ చిన్న కృష్ణ, వైసిపి సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, తహసీల్దార్ కనకరావు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి పూజ శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 'ఏఐటియుసి) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 15న హిందూపురంలో మున్సిపల్, నగరపాలక, నగర పంచాయితీలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, నాన్ పిహెచ్ వర్కర్స్, ఇంజనీరింగ్, ఆఫీస్, విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారం చేయాలని జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర సమితిసభ్యులు కోన లక్ష్మణ పిలుపు నిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్లో పనిచేస్తున్న 13000 మంది సిబ్బందికి గత పిఆర్సిలో వేతనాలు పెంపు బేసిక్ పేకు అనుగుణంగా జరగలేదన్నారు. డేటా ప్రాసెసింగ్ ఒకే మున్సిపాలిటీలో వేరువేరు వేతనాలు చెల్లించి వారి శ్రమను ప్రభుత్వం అవమానిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సదస్సు ను విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగిన ల్యాండ్ పూలింగ్ బాధితుల దీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా మామిడి పాలెం గ్రామం విఎంఆర్డిఏ జగనన్న కాలనీ లేఅవుట్ లో ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం 2వ రోజూ కొనసాగాయి. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ.లక్ష్మీకుమారి, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బేరా జగదీశ్, మరిసా సతీష్, నవ యువ సమాఖ్య నాయకులు నందారపు భాస్కర్రావు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల భూములను లాక్కోవడానికి రకరకాల జీవోలు, చట్టాలు పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ప్రజల హక్కులను కాలరాస్తూ వారి జీవనోపాధిని దెబ్బతీస్తూ మరో వైపు కార్పొరేట్, రాజకీయ శక్తులకు భూములను, సహజవనరులను దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి దేముడు, బత్తిన అశోక్, బి.భాస్కర్రావు, కె.రాజు ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్లో జరిగిన అవగాహన సదస్సులో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కష్ణంరాజు, సీనియర్ ఐఎఎస్ అధికారి, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి కెఆర్‌బిహెచ్ఎన్ చక్రవర్తి, ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పాత్రిన శ్రీరామ్మూర్తి, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శివయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయ బాబు, కళాశాల అధ్యక్షులు కేఎస్ఎన్ మంగరాజు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘానికి పలువురు విరాళాలను అందజేశారు.

సిహెచ్‌సిని పరిశీలించిన డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- కె.కోటపాడు : రూ.5 కోట్లతో ఆధునికీకరిస్తున్న స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు. ఆసుపత్రిని పరిశీలించి రోగులను వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించుటకే 30 పడకల నుంచి 50 పడకులకు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్. జెడ్పిటిసి ఈర్లె అనురాధ, వైద్యాధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన తహశీల్దారు

27న సమగ్ర ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాశక్తి - యలమంచిలి : సమగ్ర ఓటర్ల జాబితాను ఈ నెల 27న ప్రచురించడం జరుగుతుందని, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని మండల తహశీల్దారు రాణీ అమ్మాజీ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శు క్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహశీల్దార్ రాణీ అమ్మాజీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగుమండలాల్లో ఇంతవరకు 2,02,732 ఓట్లు నమోదయ్యాయని, వీరిలో పురుషులు 98,975 కాగా, మహిళలు 1,03,742, థర్డ్ జెండర్ 15 మంది ఉన్నట్లు చెప్పారు. సమగ్ర ఓటర్ల జాబితా కోసం వచ్చిన 31,201 ధరఖాస్తులను పరిశీలించిన అనంతరం అందులో 10,189 ధరఖాస్తులను ప్రోసెస్ చేసి అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన 20వేల దరఖాస్తులు అప్‌లోడ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల సమావేశాలను అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలోని ఎన్ఎఓబి కార్యాలయంలో కాకుండా నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలిలో నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఆడారి రమణబాబు (టిడిపి), కొల్లి త్రినాథ్, కోడిగుడ్డు రమణ (వైఎస్ఆర్‌సిపి) బొద్దపు శ్రీనివాసరావు, సోమునాయుడు (జనసేన) పాల్గొన్నారు.

భవనానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా యాదవ సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్లు స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా యాదవ సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు యాదవ సంఘం నాయకులు కన్నారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి అనకాపల్లి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన బాబురావు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావ పాల్గొన్నారు.

బొడ్డు శ్రీనివాసరావు నియామకంపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు శ్రీనివాసరావు నియామకంపై అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే విధంగ బొడ్డు శ్రీనువాసరావు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించేవిధంగా శ్రీనివాసరావు కృషి చేయాలని కోరారు.

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నారాయణ, శ్రీచైతన్య, రవీంద్ర భారతి, ఆదిత్య తదితర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మకు ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ హాలిడే రోజున, సాధారణ వర్కింగ్ డేస్‌లో కాలపరిమితి పెంచి పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే విధంగా విద్యాబోధన చేయడం దుర్మార్గమన్నారు. కనీసం మౌలిక సదుపాయాలు, సరైన క్లాస్ రూమ్స్ లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఈ పాఠశాలలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ మామిడి రమణ, జిల్లా ట్రెజరర్ గొర్లి తరుణ్, జిల్లా ఉపాధ్యక్షులు జి గీతకృష్ణ పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

'జగనన్నకు చెబుదాం'కు గురుకుల పాఠశాల సమస్యలు



జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నెంబర్‌కు మెసేజ్ చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి- అనకాపల్లి

మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల దసరా సెలవుల సందర్భంగా తల్లిదండ్రులతో శు క్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మా పాఠశాల సమస్యలపై జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో నిర్ణయం మేరకు 1902కి కాల్ చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా గురుకుల పాఠశాల స్థల కేటాయింపు, తాగునీరు, దోమలు, బెంచీలు, డార్మెట్రీ, బెడ్లు, స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్స్, కంప్యూటర్స్‌తో కూడిన ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్లు ఇన్ఫ్రాస్ట్రక్చర్స్, స్పోర్ట్స్ కిట్లు, దోమల నివారణకు ఫాగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై స్థానిక మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం రాలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాల తల్లిదండ్రులు 140 మందికి పైగా పాల్గొన్నారు.

26 నుంచి బాలల దినోత్సవ కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 26 నుంచి నవంబర్ 14 తేదీ వరకు జిల్లాలో బాలల దినోత్సవం పిఆర్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు -2023 బ్రోచరును వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు డి గోపీనాథ్ మాట్లాడుతూ బాలల దినోత్సవంలో భాగంగా ఈనెల 26న చిత్రలేఖనం, 27న దేశభక్తి గేయం, 28న పద్య పఠనం, 29న క్విజ్, నవంబర్ 1న కాగితంతో కళాకృతులు, 13న స్పాట్నీ పోటీలు జరుగుతాయని, 14న వివిధ రంగంలో ప్రతిభవంతులైన బాలలకు పురస్కారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.పెద్దినాయుడు, కాండ్రేగుల జనార్ధనరావు, గంట్లా శ్రీను, పి.ఆనందరావు, కోవెల రవి, ఏవీ.రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.జగన్నాథరావు

రైతు ఉత్పత్తిదారుల సంస్థల అభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి- కశింకోట : రైతు ఉత్పత్తిదారుల సంస్థల అభివృద్ధిపై స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో 2వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమం డ్వాక్రా లీడర్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ అధికారి కె.జగన్నాథం మాట్లాడుతూ మహిళల ఉత్పత్తిదారుల సంఘాలకు ఉండాల్సిన 10 సూత్రాలపై తెలియజేశారు. కలసి కట్టుగా ఎరువులు, మందులు సామగ్రి కొనుగోలు చేసుకోవటం గురించి వివరించారు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు, సబ్సిడీలు అందించటం తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఎమ్ శ్రీనివాసరావు, ఆడారి పరమేశ్వరి, ముత్తాత లక్ష్మి, సత్యనారాయణ, రామకృష్ణ, అనురాధ పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో సోషల్ మ్యాపింగ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఓరియంటల్ యూనివర్సిటీ ఇండోర్ అగ్రికల్చర్ విద్యార్థులు సోషల్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని చేశారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారిశెట్టి వెంకట అప్పారావు, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.



గేయాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

భగవద్గీత గేయాల రికార్డు

ప్రజాశక్తి-చోడవరం : ఆలిండియా రేడియో ప్రసార కార్యక్రమం నిర్వాహకులు స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పాడిన భగవద్గీత దేశభక్తి గేయాలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా రేడియో ప్రసార కార్యక్రమం నిర్వాహకులు రామ్ సూర్య ప్రకాశరావు, దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మనలో ఉన్న కళలను వెలికి తీసి భవిష్యత్‌ను చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవి.రామిరెడ్డి, సంగీతం ఉపాధ్యాయులు సోమేశ్వరి, ఆంగ్ల ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరి, సిఆర్‌పి కెవియమ్.నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : గణేష్ నవరాత్రుల్లో భాగంగా స్థానిక నాయుడు వీధిలో లవ్లీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారిని డిప్యూటీ సీఎం బూడి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలను ఆయన తిలకించారు. లవ్లీ బాయ్స్ యూత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, ఎంపిటిసి ఎం.కృష్ణమూర్తి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి డి.నాగేంద్ర, వాలేటి నాగరాజు, బంధం అప్పలరాజు, తోట అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

పలుచోట్ల 'బాబుతో నేను' ప్రచారం

ప్రజాశక్తి-సబ్బవరం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మండలంలోని ఆసకపల్లి గ్రామంలో బాబుతో నేను అన్న కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కరణం రామునాయుడు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి రవి కుమార్, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాల నాయుడు, కరణం రామునాయుడు, బర్ణికాన బాబురావు, రేసుపూడి రమణ, గవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాం, కన్నూరు, పెదముషిడివాడ గ్రామాలలో టిడిపి నాయకులు శుక్రవారం బాబుతో నేను కార్యక్రమం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అట్టా సన్యాసప్పారావు, బోండా తాతారావు, ఇందల కొండలరావు, రొంగల గోపాలకృష్ణ, గొల్లవిల్లి నాగేశ్వరావు, పెద ముసిడివాడ ఎంపీటీసీ ఓమ్మి వెంకటరావు, బంధం వెంకటరమణ పాల్గొన్నారు.

రోలుగుంట : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ రోలుగుంట మండలం ఎంకే.పట్నం పంచాయతీ శివారు సింగరాజు పేట గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బత్తుల తాతిబాబు, ఎంపిటిసి ఎస్.కృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు చంద్రమౌళి హాజరై మాట్లాడారు.

ఆరిలోవ : 12వ వార్డులో టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో ఈశ్వరిదేవినగర్, బాల మురళీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసారు. పదో వార్డులో టిడిపి అధ్యక్షులు గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో వివేకానందనగర్, ఎస్ఐజి నగర్ ప్రాంతాల్లో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు.

రచ్చబండ

అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణ పురంలోనూ, గవరపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వేర్వేరుగా రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాక్షేత్రం నుంచి చంద్రబాబును దూరం చేసేందుకు జగన్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కెకెవిఎ.నారాయణరావు, కడిమిశెట్టి నర్సింగరావు, ధనాల విష్ణు చౌదరి, కుప్పిలి జగన్, బోడి వెంకట్రావు, విల్లూరి రమణబాబు, పొలిమేర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో గురువారం రాత్రి బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ప్రజా వేదిక నిర్వహించారు. ఇందులో పాల్గొన్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్ మాట్లాడుతూ ఓటమి భయంతోనే జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను అడ్డుపెట్టుకొని చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో చౌడువాడ సర్పంచి దాడి ఎరుకునాయుడు. టిడిపి నాయకులు ఎం.గోవిందరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

తగరపువలస : టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి భీమిలి మండలం, దాకమర్రిలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు డిఎవన్ రాజు, నాయకులు ఎస్ ప్రకాష్, తమ్మిన వెంకట రమణ పాత్రుడు, అల్లు చిన్నయ్య, పతివాడ రాంబాబు, యరబాల అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం గ్రామకూడలి వద్ద 'బాబు ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారెంటీ' పేరిట ప్రజావేదిక సభ నిర్వహించారు. జివిఎంసి మూడో వార్డులో 'బాబుతో మేము' సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ కౌన్సిలర్లు పి లక్ష్మీకుమారి, ఎ గురునాథ్, సిహెచ్ రమణ, నాయకులు కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో వైసిపి అడ్రస్ గల్లంతు కావడం తథ్యమని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎం.శ్రీ భరత్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం వద్ద పార్లమెంట్ నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే, దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీభరత్

బోరుబావి వద్ద అపారిశుధ్య సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో మంచినీటి బోరు వద్ద అపారిశుధ్యం సమస్యపై స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ స్పందించి పరిష్కరించారు. బోరు చుట్టూ ప్లాట్ పారం నిర్మాణం, బోరు వద్ద వాడుక నీరు పోవడానికి రోడ్డు అవతల ఉన్న కాలువకు పైపులు ఏర్పాటుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో శుక్రవారం బోరు వద్ద పనులు చేశారు. ఈ పనులను సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ దగ్గర ఉండి పర్యవేక్షించారు. అలాగే గొల్లగుంట గ్రామంలోని మంచి నీటి బోరు, శ్మశానవాటిక వద్ద బోరులు రిపేరు కావడంతో వాటికి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు సర్పంచ్‌ను కోరగా ప్రతిపాదనలు పంపించి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సైరా బేగం, గ్రామస్తులు షేక్ ఆలీ, జలీల్, జాకీర్ హుస్సేన్, మక్షుద్ ఆలీ, షేక్ మదీనా, కాంట్రాక్టర్ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



బోరు పోవడానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) మండలశాఖ అధ్యక్షుడు బొడ్డేడ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యలమంచిలి మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా భీశెట్టి లక్ష్మణరావు, అధ్యక్షులుగా బొడ్డేడ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లిపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కర్రి కోదండ రామలక్ష్మి, నేతి సత్యనారాయణ, ఉప కార్యదర్శులుగా పిల్లా అప్పారావు, వి.సుజాత, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.చంద్రశేఖర్, వై.సత్యారావు, కె.వీరభద్రరావు, పి.వరలక్ష్మి, ఎం.పాపారావు, ట్రెజరర్‌గా జి.సర్వేశ్వరరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పోరాటస్ఫూర్తితో పనిచేస్తామని నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ చేసింది.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణమే పూర్తి జీతాలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులుపై కక్ష సాదింపు చర్యలకు పూనుకుంటుందని, బదిలీ ఆయన ఉపాధ్యాయులకు మూడు నేలలు నుండి జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు సెప్టెంబర్ నెల జీతాలు ఇప్పటికీ 60శాతం చెల్లించలేదన్నారు. దీంతో ఇంటి ఖర్చులు, మందుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా జీతాల కోసం ఎదురు చూసేలా చేస్తే వైసిపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకా తప్పదని వెంకన్న హెచ్చరించారు.

పంట రుణాల డేటాను అప్‌లోడ్ చేయించుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట : సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులందరూ తమ బ్యాంకు బ్రాంచ్‌లో సంప్రదించి సున్నా వడ్డీ పంట రుణాలు పోర్టల్‌లో తమ డేటాను అప్‌లోడ్ చేయించుకోవాలని అనకాపల్లి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎమ్.రామారావు అన్నారు. కశింకోట మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలన్నీ క్లుప్తంగా తెలియజేశారు. ఉగ్గిని పాలెం సర్పంచ్ కలగా గున్నయనాయుడు మాట్లాడుతూ ఏయస్ పేటలో కోతలు బెడదను నివారించాలని, బయ్యవరం గ్రామం పరిధిని కరువుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి స్వప్న, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజా క్షేత్రంలోకి రాకుండా జగన్ కుట్ర

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : క్రమశిక్షణతో కూడిన అలవాట్లు కలిగిన టిడిపి అధినేత చంద్రబాబును ఆరోగ్యపరంగా దెబ్బకొట్టి ప్రజాక్షేత్రంలోకి రానివ్వకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుట్ర చేస్తున్నాడని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుపై జగన్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి 34 రోజులుగా జైలుకే పరిమితం చేసి అక్కడ కనీసం సౌకర్యాలు కూడా కల్పించకుండా ఇబ్బందులుపాలు చేయడం దుర్మార్గమన్నారు. స్కిన్ అలర్జీ కారణంగా చంద్రబాబు ఎక్కువసేపు వేడి వాతావరణాన్ని తట్టుకోలేరని, ఈ విషయాన్ని జైలు అధికారులు దృష్టికి మొదట్లోనే తీసుకెళ్లిన నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. చంద్రబాబును తక్షణమే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూలపేటలో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో సర్పంచ్ గంగప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుకి ఇరువైపులా, శ్మశాన వాటికలోని పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపంతో పాటు తాగునీరు, వీధి దీపాలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ముల్లేటి గోవిందరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ ఆదికుమార్, రామాలయ కమిటీ చైర్మన్ ఆడారి కాశీరావు పాల్గొన్నారు.



తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు

-ఎంపిపి దళిత మహిళని వివక్షత తగదు
-మండల సమావేశంలో నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల పి హెచ్‌సికి ఎంపీపీ అధ్యక్షతన కమిటీ నియమించాల్సి ఉందని, ఎంపీపీగా రత్నం పదవి చేపట్టి రెండేళ్ల అయినా కమిటీ ఎందుకు ఏర్పాటు చేయలేదని దళిత మహిళని వివక్షా అని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అధికారులను ప్రశ్నించారు .నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వీసం మాట్లాడుతూ, ఆసుపత్రికి నేటి వరకు కమిటీ ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. వెంటనే తీర్మానం చేసి డిఎం అండ్ హెచ్ ఓ కు పంపించి కమిటీ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఎంపీపీ అధ్యక్షతన జరగాలని, అలా జరగలేదన్నారు.ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయకపోవడంతో గ్రామ ప్రజలు దాహం కేకలతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని న్యాయంపూడి, వేంపాడు ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, కుంచె మధు అధికారులను నిలదీశారు.గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గంమెక్కడని ప్రశ్నించారు.సమావేశానికి రాని అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. వేంపాడు, వేంపాడు కొత్తూరులో జలజీవన్ మిషన్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీటీసీ సభ్యులు మధు డిమాండ్ చేశారు.ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మత్స్యకారుల సమావేశానికి ఎంపీపీ కు ఎందుకు ఆహ్వానం పలకలేదని వైస్ ఎంపీపీ నానాజీ మత్స్యశాఖ అధికారిని ప్రశ్నించారు.బంగారమ్మ పేటలో జరిగిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభోత్సవాన్ని కూడా ఎంపీపీని ఆహ్వానించలేదన్నారు.



మాట్లాడుతున్న ఉపమాక సర్పంచ్ వీరబాబు

గొడిచెర్ల పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జి పొడగట్ల పాపారావు మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోయాయని, రైతులందరికీ క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు.ఉద్దండపురం మెగా వాటర్ ప్రాజెక్టు నుండి సరఫరా అయ్యే త్రాగునీరు పచ్చగా ,ఎర్రగా ఉంటుందని దీనివలన ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని చర్యలు చేపట్టాలని పాపారావు, ఎంపీటీసీ సభ్యులు బచ్చల రాజు ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు .చిన తీనార్ల లో వెంటనే సచివాలయం ,డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

వర్షాభావ పరిస్థితుల ప్రభావం కారణంగా పంటలన్నీ ఎండిపోయాయని నక్కపల్లి ని కరువు మండలం గా ప్రకటించాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేద్కర్, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, ఏవో సీతారామరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి సౌకర్యాలేవీ?

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కుసర్లపూడి గ్రామంలో జగనన్న కాలనీ రోడ్డు సౌకర్యం, కరెంట్, తాగునీటి సౌకర్యం అధికారులు కల్పించలేదని ఆ గ్రామ సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు మండల సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుసర్లపూడి సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాల నుండి సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారం కాలేదన్నారు. దీనిపై ఎలక్ట్రికల్ ఎఇ పద్మనాభం మాట్లాడుతూ మెట్లపై ఇళ్ల నిర్మాణం చేయడంతో ఎలక్ట్రికల్ పోల్స్ వేయడం ఇబ్బందిగా మారిందన్నారు. జగనన్న లేఅవుట్ల స్థలాలు చదును కోసం 5లక్షలు ఖర్చు అయిందని హౌసింగ్ ఎఇ తెలిపారు. బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెళ్లే రహదారి మార్గంలో చెత్త వేస్తున్నారని వైద్యాధికారి సునీత సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిపి శ్రీనివాసరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

విద్యుత్ లైన్ మార్చరూ..

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డిఎల్ పురంలో ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు తరచూ విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని, ఇబ్బంది లేకుండా విద్యుత్ లైన్ మార్చాలని సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు కనకారావు కోరారు. సమస్య పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ట్రాన్స్ కో ఏఈ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 4 వేల మంది జనాభా ఉన్నారని, వీరికి తాగునీరు సరఫరా చేసేందుకు 60 వేల కెపాసిటీ వాటర్ ట్యాంకుతో పాటు, మరో రెండు చిన్న వాటర్ ట్యాంకులు ఉన్నాయన్నారు. గునుపూడి గ్రామం నుండి జీడి, కొబ్బరి తోటల వెంబడి విద్యుత్ లైన్ ద్వారా మోటార్లకు కరెంటు సప్లై వస్తుందని వర్షాలు, గాలులు వీచినప్పుడు విద్యుత్తు తీగలు తెగిపోయి అంతరాయం ఏర్పడుతుందన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఎస్ఐని నియమించాలని వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజక వర్గం నాతవరం మండలం పోలీస్ స్టేషన్ లో పూర్తి స్థాయి ఎస్సైను నియమించి శాంతి భద్రతలను కాపాడాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర కోరారు. శుక్రవారం నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, గత మూడు నెలల నుండి నాతవరం పోలీస్ స్టేషన్ లో ఎస్సై లేరన్నారు. దీంతో ప్రజల ఫిర్యాదులకు పరిష్కారం కరువైందన్నారు. మండలంలో విపరీతమైన దొంగతనాలు, అల్లర్లు, భూతగాదాలు, మందుబాబులు చేసే అల్లర్లు, మిస్సింగ్ కేసులు ఇలా ఎన్నో అరాచకాలతో పాటు పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షులు బైన మురళీ, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు పాల్గొన్నారు.

గడ్డి కుప్ప దగ్ధం

ప్రజాశక్తి - రావికమతం : మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు గడ్డివాము కాలి బూడిద య్యింది. మండల కేంద్రానికి చెందిన రావి వెంకట్రావు అనే రైతు గడ్డివాము శుక్రవారం ప్రమాదవశాత్తు కాలి బూడిదయ్యింది. గర్నికం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా కాళీ బూడిదఅయింది. ఈ ప్రమాదంతో సుమారు పదివేల రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.



దగ్ధమైన గడ్డి కుప్ప

సాగరంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- మాడుగుల: సాగరం పంచాయితీ పరిధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శుక్రవారం సాగరం పంచాయతీకి చెందిన సాగరం కాలనీ పాఠశాల ఆవరణలో సంగి వలస అనిల్ నీరు కొండ ఆసుపత్రి సహకా రంతో ఉచిత వైద్య సేవలు నిర్వహి ంచినట్లు కేజే పురం భానోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ రాపేటి రామ కొండలరావు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా 175 మంది రోగులను పరీక్షించే ఉచిత మందులను రోగులకు అందించినట్లు ఆయన చెప్పారు. వీరిలో 22 మందిని రోగులకు శస్త్ర చికిత్స అవసరమని గుర్తించినట్లు అనిల్ నీరుకొండ ఆసుపత్రి పిఆర్‌వో లు కే ఉదయ్ కుమార్, ఆర్ అప్పలరాజు తెలిపారు. వీరిని శనివారం బస్సులో ఉచిత ప్రయాణం ద్వారా తీసుకుని వెళ్లి అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో ఉచితముగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. సూర్యకాంతం జగ్గారావు, గ్రామ సర్పంచ్ జయమ్మ సన్యాసినాయుడు పాల్గొన్నారు.



మందులు ఇస్తున్న నిర్వాహకులు

ఇఒపిఆర్‌డిగా భానోజీరావు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల పంచాయతీ విస్తరణ అధికారి (ఈఓపిఆర్డి)గా భానోజీరావు బాధ్యతలు తీసుకున్నారు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు కోటవురట్ల పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఇన్చార్జిగా వ్యవ హరించారు.





మాట్లాడుతున్న ప్రసాదరావు

కొండపాలెంలో పశువిజ్ఞాన బడి

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొండపాలెం గ్రామంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమంను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాద్‌రావు పరిశీలించారు. స్థానిక పశుసంవర్ధక సహాయకులు యశోద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు పాడి పశువుల పెంపకంపై ఆధునిక పద్ధతులు, శాస్త్రీయ మార్పులపై అవగాహన కల్పించారు. హాజరైన పాడి రైతులు, గొర్రెలు, పెంపుకుందారుల సందేహాలను నివృత్తి చేశారు.

పాఠశాలలు తెరిస్తే చర్యలు : ఎంఇఒ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: దసరా సెలవుల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సెలవులు పాటించకుండా తెరిస్తే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మాట్లాడుతూ, సెలవుల సమయంలో విద్యార్థులను ప్రత్యేకమైన బోధనకై పాఠశాలలకు రప్పించరాదన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు వైద్యం



గొలుగొండ మండలం చోద్యంలో కార్డులు ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ
మండలంలోని చోద్యం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం కల్పించే విధంగా ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, వైద్యాధికారులు బి.హారిక, ఎస్.లలితా తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్. జెడ్పిటిసి ఈర్లె అనురాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పైడివాడ సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.రమేష్ నాయుడు, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, వైసిపి నాయకులు కొటాన రాము, పెచ్చెట్టి రమేష్ నాయుడు, కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని జె తుని గ్రామంలో సురక్ష శిబిరాన్ని ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ రమేష్, యశోద, రోగులకు తనిఖీ చేసి ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, కార్యదర్శి మేరీ జోన్స్, వైసిపి నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని పాపయ్యపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఈఓపిఆర్డి ధర్మారావు, సర్పంచ్ తలారి సత్యనారాయణ, అన్నం చెల్లయమ్మ, బొండా అప్పలరాజు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్ భీమవరంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నేత కొల్లిమల అచ్చంనాయుడు, ఎంపీడీవో సువర్ణ రాజు, తహసిల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీతమ్మధార : 43వ వార్డు శ్రీనివాసనగర్ దాడి రామూర్తి కల్యాణ మండపం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 43, 44వార్డుల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, జెడ్‌సి ఆర్‌జివి కృష్ణ, జెసిఎస్ మండల కన్వీనర్లు బులుసు జగదీశ్, నీలి రవి,కిరణ్ రాజు, ఆళ్ల శివ గణేష్,అంబటి శైలేష్, గోపి, ఎం.గోపి, రామారావు, వెంకట్, రవి, కన్నప్పడు, వల్లి, ఖాదర్ పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని బాందేవపురం సచివాలయంలో జగన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.సచివాలయ పరిధిలోని విలాస్‌ఖాన్‌పాలేం, విజయరామపురం, బాందేవపురం, తిమ్మాపురం గ్రామాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు వచ్చి వైద్యసేవలను వినియోగించుకున్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో ఎంపిపి కె రాంబాబు. జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు. వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ఎంపిడిఒ ఎం.విజయకుమార్, ఎంపిటిసి బోని సావిత్రి పాల్గొన్నారు.

అనందపురం : మండలంలో కుసులువాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రోగులకు సేవలందిచిన వైద్యులను సత్కరించారు కార్యక్రమంలో సురక్ష ప్రత్యేక అధికారి పద్మ, ఎంపిడిఒ అడపా లవరాజు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ వెంకటలక్ష్మి శివాజీ, ఎంపిటిసి తోమిరోతు లక్ష్మి సత్యం పాల్గొన్నారు.

తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోని తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి ఉపాధి రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. జివిఎంసి జోన్ 3 పరిధిలో ఉన్న తోపుడుబండ్లు, చిరు వ్యాపారస్తులతో విశాఖ తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి దరి సిఐటియు కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పోలీసులు, జివిఎంసి అధికారులు చిరువ్యాపారస్తులపై దాడులు ఆపాలన్నారు. ఇటీవల కాలంలో రాజకీయ వేధింపులు భారీగా పెరిగాయన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ అమూల్ షాపులకు మాత్రం ప్రభుత్వం, జివిఎంసి, పోలీసు యంత్రాంగం స్థలాలు చూపించి తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ సమస్యలపై ఈ నెల 20 నుంచి నవంబర్ 3 వరకు సెంటర్లలో నిరసనలు చేపట్టాలని, నవంబర్ 15న చలో జివిఎంసికి సిద్ధం కావాలని అన్నారు. సిఐటియు మద్దిలపాలెం కార్యదర్శి పి.వెంకటరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీను, అప్పారావు, వైకుంఠరావు, చిన్ని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

నిబంధనలకు ప్రైవేటు పాఠశాలలు తూట్లు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: అనకాపల్లి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల నిర్వహిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహిస్తూ.. విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే విధంగా విద్యాబోధన చేయడం దుర్మార్గమని ఆగ్రహించారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు, సరైన తరగతి గదులు, భద్రతా ప్రమాణాలు పాటించకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని విమర్శించారు.అనకాపల్లి జిల్లా డీఈఓను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా రవీంద్ర భారతి, నారాయణ, చైతన్య, ఆదిత్య వంటి పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ మామిడి రమణ, జిల్లా ట్రెజరర్ గొర్ల తరుణ్ పాల్గొన్నారు

ఆకట్టుకుంటున్న ఎరుపు రంగు చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎరుపు రంగు అంశంపై యువ కళాకారులు సింధూ రెడ్డి, సూర్యదేవ్ దాసరి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంటోంది. బీచ్‌రోడ్ లోని హవా మహల్‌లో శుక్రవారం ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ మొదలైంది. జైపూర్ రాజమాత మయాంక్ కుమారి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఫొటోగ్రఫీ విభాగం అధ్యాపకులు ఎస్‌విఎస్.రవికుమార్, బికె.అగర్వాల్, సునీత, సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు. మానవ జీవితంలో ఎరుపు అనేది ఒక భాగం. ఆ విషయాన్ని సింధూర్ రెడ్డి ఫొటోగ్రఫీ ద్వారా, సూర్యదేవ్ దాసరి ఆర్ట్ ద్వారా తెలియజేస్తూ రూపొందించిన చిత్రాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. దాదాపు 80 హస్త కళ చిత్రాలు ఇక్కడ కొలువుదీరాయి.


ఎగ్జిబిషన్‌లోని కళాకృతి


మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు

విభిన్న ప్రతిభావంతుల హక్కులు, చట్టాలపై అగాహన

ప్రజాశక్తి- రావికమతం: విభిన్న ప్రతిభా వంతుల పిల్లల తల్లిదండ్రులకు రావికమతం మండలం మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహిత విద్యా విభాగం వనరుల గదిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావు అధ్యక్షతన హక్కులు, చట్టాలు, ఉపకరణాల వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాద నాయుడులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కులు, చట్టాలను తెలుసుకొని వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన ఉపకరణాలను, బోధనోపకరణ సామాగ్రిని జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని రకాల సేవలు, సదుపాయాలను అందించడంతోపాటు ఉచితంగా ఉపకరణాలను, అలవెన్సును అందించడం జరుగుతుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, ఉపాధ్యాయులు ఎర్రయ్య, కృష్ణవేణి, దివ్యాంగ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-గొలుగొండ: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి అన్నారు. శుక్రావారం గొలుగొండ మండలం తాండవ రిజర్వాయర్ ప్రాంతంలో మత్స్యకారులు అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుంచి 8 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రావణాపల్లి మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు నక్కా రమణ, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపిపిలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి సాలికమల్లవరం సర్పంచ్ పెదిరెడ్ల నూకరత్నం గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు ఉప సర్పంచ్ సేనాపతి రమేష్ మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు జువ్వల దేముడు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.
అదే విధంగా రావణాపల్లి జలాశయంలో 74వేల చేప పిల్లలను ఏఎసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, అనకాపల్లి జేడి ప్రసాద్‌లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, నక్కా రమణ, కొల్లు గంగునాయుడు, దన్ని రమణ, నడిగొట్ల లోవరాజు, శ్రీను పాల్గొన్నారు.


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎంపిపి, .జెడ్‌పిటిసి

కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న కనక మహాలక్ష్మి బ్యాంకు నిర్వాహకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు పొందిన కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు జాతీయ స్థాయిలో మధ్య తరహా అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో ఉత్తమ ఎన్‌పిఎ మేనేజ్‌మెంట్ (నిరర్థక ఆస్తుల నిర్వహణ) అవార్డు లభించింది. బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ నిర్వహించిన ఎన్‌సిబిఎస్-2023లో ఈ అవార్డును దక్కించుకుంది. ఇటీవల గోవాలో జరిగిన ఎన్‌సిబిఎస్, ఎఫ్‌సిబిఎ - 2023 అవార్డుల కార్యక్రమంలో బ్యాంకు అధ్యక్షులు కొమ్మారెడ్డి రాంబాబు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్, ఎజిఎం (రుణాలు) పి.వీరభద్రరావులు బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ గ్రూప్ అధ్యక్షులు బాబునాయక్, గోవా సహకార శాఖ మంత్రి సుభాష్ శిరోద్కర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. బ్యాంకుకు అవార్డు లభించేందుకు కృషి చేసిన బ్యాంకు సిబ్బందికి పాలకవర్గం అభినందనలు తెలిపింది. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా ఈ అవార్డు పొందటం సంతోషంగా ఉందని బ్యాంకు అధ్యక్షులు కె.రాంబాబు పేర్కొన్నారు.

ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

-డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శుక్రవారం నర్సీపట్నం మున్సిపాలిటీ బలి ఘట్టం రోడ్డు వద్ద డీవైఎఫ్ఐ నిరసన నిర్వహించింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ మాట్లాడుతూ, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు తీస్తామని నరేంద్ర మోడీ వాగ్దానాలు ఇచ్చి తీరా నిలువునా నిరుద్యోగుల్ని మోసం చేశారని విమర్శించారు.మరోపక్క వేల కోట్లు అంబానీ ఆదానీలకు దోచిపెడుతున్నారని ఆగ్రహించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి ఏడాది మెగాడిఎస్సి విడుదల చేస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా నోటిఫికేషన్ విడుదల చేయకుండా మోసం చేసిందన్నారు. అధికారంలోకి రాకముందు 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత 5100 పోస్టులు మాత్రమే ఉన్నాయని చెప్పడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రాజ్యసభలో కేంద్ర మంత్రి ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ లో 39008 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారని, ఇప్పటికైనా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మణికంఠ స్వామి, డివైఎఫ్ఐ నాయకులు, యువతీ యువకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు


దగ్ధమైన గృహం


గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో గుండు పాల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి తాటాకు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పంపరబోయిన రాజబాబుకు చెందిన ఇంటిలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోగా ఇంట్లో ఉన్న ఐదు తులాలు బంగారం, నగదుతో పాటు విలువైన సామగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షునిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చీడికాడ: అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బొడ్డు శ్రీనివాసరావు నియమితులయ్యారు. చీడికాడ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనివాస రావు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఏఐసీసీ కమిటీ శ్రీనివాసరావుని అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు.




విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో జోగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కొర్ర దిలీప్ పాడేరులో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ 14 వాలీబాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భూపతి లోవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సరోజిని, ఉపాధ్యాయులు దిలీప్‌ను అభినందించారు.